# మగని చెవిలో

"అనసూయ"

(రాబడిగురించి)

ఏమిటండీ! పూర్వం అలాగు మేస్రీటుకచేరీలకు యీవూరూ ఆవూరూ తిరిగేవారు! ఇప్పుడు ఎక్కడికీ వెళ్లలేదు, కారణంయేమిటి? క్లబ్బువాళ్ళను వదలలేకనా? లేక పార్టీలు రాకనా? మునుపంత తరుచుగావచ్చి తీసికెళ్లేవాళ్లు ఇప్పుడెంచేతనేమిటి రావడం మానేశారు? మీరంటే వాళ్ళకి మొగం మొత్తేసిందా యేమిటి? డిప్రెషనురోజులా? డిప్రెషనురోజులైతే మీకేనా అందరికిన్నా? అందరికీ అయితే మనయింటి యెదుటిమచ్చలప్లీడరు ఎందుకలాగు అంతతరుచుగా తిరుగుతాడు? వాడిలాంటి వాళ్లు రావడమే యీఅనర్థానికి కారణమా? వాళ్లు చేసిన తప్పేమిటి? వాళ్లు మీలాగు పార్టీలను నిస్సారంగాచూచి తగిలేస్తే వాళ్లూ మీలాగేఉందురనా మీతాత్పర్యం? వాళ్లు పార్టీలను ఎలాగో చేరదీసి నాలుగురాళ్లు సంపాదిస్తున్నారా లేదా? ఒకడెవడో కోర్టుకు యెదురుగుండా పెద్దమేడకట్టేడుట! ఒకడు వేలకొద్దీ ఖర్చుపెట్టి యిద్దరాడపిల్లలకు పెళ్లిళ్లుచేసేడట! మరి వాళ్లెలాగు అవన్నీ చేస్తున్నారు?

డిక్రీ సొమ్ముతినేసి, పార్టీలసొమ్ము ఎగవేసి సొమ్ముతినేస్తే పార్టీలు వూరుకుంటారూ? మీరు వాళ్ళసొమ్ము యింట్లోకైనా తీసుకురాకుండా అక్కణ్ణించి అక్కడే యిచ్చివేస్తూవుంటారే, తక్కిన వాళ్లు భయములేకుండా ఆసొమ్ము ఎలాగుతినేస్తారు? వాళ్ళని ఎవళ్లూ ఏమీ చెయ్యరూ? వాళ్లకు మాట రాదూ?

అవునుగాని మీప్లీడర్లు చాలామంది కార్లుకూడా కొన్నారుట! అంతడబ్బు వాళ్లకుదొరకుతూఉన్నద యేమిటి?

"ఆ! అలాగే! కార్లుకొనటానికి చేసినఅప్పులు ఇంకా తీరలేదు; కొందరిమీద దావాలుకూడా పడ్డాయి! కొందరప్పుడే అమ్మేసుకున్నారు!"

ఇంతేనా! చేదపురుగుకి రెక్కలు వచ్చినంత సేపైనా లేదేమండీ యీకార్లసందడి! అందరికీ అంత దొరక్కుండాఉందండే? మరి అలాగైతే ఆ బొమ్మలాటదానిలాగు ఉంటాడు ఆప్లీడరు, అతడెందుకండీ హాయిగా తనవూళ్ళో తనకు వందో రెండువందలో దొరుకుతూఉంటే మానేసి యిక్కడికి పెద్దకుటుంబంతో వెళ్లిపోవచ్చేడు?

'వాడిప్రారబ్ధము!'

ఇక్కడేమైనా దొరుకుతూ ఉందా?

'ఆ! నెత్తికిచేతులు!'

మరైతే ఎవళ్లు తీసుకొనివచ్చేరండీ అతడిని ఈ ఊరు?

'వాడి శనిగ్రహము.'

ఎలాగు వాడు కాలక్షేపము చేస్తున్నాడండీ పిల్లలు గల వాడుగదా?

'రాతిలో కప్పలాగు.'

ఇంత దొరక్కుండా ఉన్నరోజులలో యేమి జారేసుకుందామని అల్లానత్తిప్లీడరు వచ్చేడండీ?

'ముష్టికి నత్తేమిటి?'

ప్లీడరు నత్తివాడున్నూ సానిది మాచకమ్మాను అయితే మరి వృత్తి యెలాగు సాగుతుందండీ?

వేణుగోపాలశతకం ఎప్పుడు వ్రాసేరండీ?

'నాకేం తెలుసును?' మీకేం తెలియదూ? మిమ్మలిని అడగడం నాదేతప్పు, బుద్ధిపొరపాటు! "యిది మంచిసమయమోయీ గోపాలా?" లేకపోతే

"ఎందుకీ తొందర సుందరాకార" అలాంటివి ఎవళ్లు వ్రాసేరో, ఎవళ్లు ఎప్పుడు ఏమో స్తరుగా ఎవరిమీద అభినయంపట్టి పాడేరో, ఆపాటలు కళావరురింగు బాగా పాడుతుంతో లేకపోతే స్టూడెంట్సు మేన్యయలు బాగా వినికిడిచేస్తుందో, ఇవన్నీ మీకు గంతస్తంగనుక చెప్పగలరుగాని శతకాలసంగతీ, పురాణాల సంగతీ, మీరెప్పుడైనా చదివితేగదూ మీకు తెలియడానికి!

'ఎందుకేమిటి ఆ వేణుగోపాలశతకం ఘోష యిప్పుడు?'

ఎందుకా? ఎందుకూ లేదూ ఆవేణుగోపాల శతకంలో వార్థక్యమున చిన్నవయసు పెండ్లామైన దారిద్ర్యమున బెక్కుతనయులైన ఆర్తుడౌ భూపతికతి భాషిమంత్రైన కడుదీర్ఘనత్రివకాలమైన అనికొన్ని యీతిబాధలు చెప్పుచూ ఇదికూడా ఒకగొప్ప యీతి బాధగా వర్ణించి చెప్పేడు. అంచేత అప్పుడుకూడా వకీళ్లుఉన్నారు కాబోలని అడిగేను? మీనత్రిప్లీడరు మాట్లాడితే కోర్టులో అందరికీ నవ్వురాదండీ!

'నత్రిమేష్టరు కన్ననయమేకదూ! గుంటలువాడికి తాటికమ్మకట్టేస్తారు నాలుగునిమిషాలలో. కోర్టులో అలాగుకాదుకదూ, నవ్వువచ్చిన యెదుట ఏమీ అనరు!'

అయితే ఈ వీధిచివరఉన్న ఎండునరం వకీలుకి ఏమైనా దొరుకుతున్నాదండీ? వాడేమిటండీ రోజుకి రోజు మరీ నరవోరుగుఅయిపోతూవున్నాడు? తిండి తింటాడో తినడోగాని మాగాయడొక్కలాగు ఎండి పోతున్నాడు! వాడికి కోర్టులో వాదించడానికేనా శక్తిఉందా?

'జలగేజలగ వాడేవాడు!'

వాడు పిల్లలిని ఏమిగొత్తుకుంటాడండీ! వాడిని చూచి మీ ప్లీడర్లందరూ ముఖ్యంగా మీరు బుద్ధి తెచ్చుకోవాలి. వాడినిచూస్తే నాకు తలిశెట్టి రామారావు ఒకమారు యింటిదగ్గిర అనేకవిధాలుగా పిల్లలను ఎత్తుకొని ఆడిస్తూ బాధలుపడుతూఉన్న ఒక గృహస్థు బొమ్మ వ్రాసేడు చూసేరూ, అది జ్ఞాపకంవస్తూ ఉంటుందండీ! మనయింటి యెదుటి ప్లీడరుమీదికి పులిమీద పుట్రలాగు మరెవడో ప్రథమశాఖవాడు ఒకడుకూడా వచ్చేడుట! వాడిని ముచ్చవకరైలు ఖర్చురూపాయి ఫీజుయిచ్చేస్తే ఏకేసైనా పట్టేస్తాడుట. మీ గుమాస్తా అంటూఉంటాడు! వక్కడైనా అంత అర్థాన్నంవుంటుందండీ? వేలకువేలు పోసుకొని కాయక్లేశాలుపడి కష్టపడి చదువుకొన్నవాళ్లే ఇలాగు గతిలేక కాణీకి పరకకీ కూరకీ నారకీ కక్కుర్తిపడి కేసులు పట్టేస్తూఉంటే, ఇకను మీరందరూ యీ దుకాణాలు యెత్తేసి యెక్కడికోపోయి మరేదో జీవనాధారం చూసుకోవలసిందే! కాని యేమి పాడురోజులు వచ్చేయండి! అవతల పార్టీలా డబ్బు పెట్టుకోలేక యేడుపు, ఇవతల రయితులా శిస్తులు కట్టుకోలేమని యేడుపు, ఏమీ దొరకలేదు, ఖర్చుల కెలాగుఅని మీరు యేడుపు! ఆ దొరకవలసిన కాస్తా మీలాంటి వాళ్లదాకా రాకుండానే ఏ కపుడుకక్కుర్తిప్లీడరో తన్నేసుకుపోతూఉంటే మరెలాగు జీవనం వెళుతుంది? లారీలాగు కడుపుంటుంది ఆ ప్లీడరుకు ఎలాగుంటుందండీ ప్రాక్టీసు?

'వాడు మాయలకు మారీచుడు! నీటిలో నిప్పు పుట్టించి దానితో దీపం వెలిగించి తనదారి తను చూచుకోగలడు.'

అయితే ఇకముందు మన మాటేమిటి? దినాలు ఎలాగు వెళతాయి! అంతా అంధకారంగా ఉన్నట్లు తోస్తున్నాది!

'అంచేతే నీవు చెప్పినా మా అమ్మా వాళ్లనూ వదిలేసి పైకివెళ్లిపోవడానికి నాకు మనస్కరించలేదు.'

అదే మీకున్న దుర్గుణం! మీ పాపమేమి! అదే మన దేశంవాళ్లందరికీ ఉన్న దుర్గుణం! ఇంత పిసరైనా ధైర్యసాహసాలు లేవు! సర్వమూ డబ్బుతో ఉన్నదనుకొంటారు! ఆ డబ్బుకోసం నానా లాచారీ

పడతారు! స్వతంత్రము, స్వేచ్ఛ వీటియందు అభిలాషే లేదు!

"త్వద్భృత్య భృత్య పరిచారక భృత్య భృత్య
భృత్య స్యభృత్య ఇతిమాం"

అని అన్నట్లు మనవాళ్లు ఎప్పుడూ బానిసలే! స్వర్గంలో చాకిరీకన్న నరకంలో రాజ్యమేలడమే గొప్ప అని పడమటివాళ్లనుకుంటూరు! అందుకే వాళ్లు సూర్యుడు గ్రుంకని రాజ్యానికి రాజులైనారు! మన వాళ్లు యిలాగు అధోగతిపాలై బానిసలై గుమాస్తా పనిలోనో ప్లీడరు పనిలోనో సాలెపట్టులో ఈగల్లాగు చిక్కుకొని కొట్టుకొంటూ ఉన్నారు! వేరే స్వేచ్ఛగాఉండి గంజో కడుగో త్రాగి హాయిగా కాలక్షేపం చేయడానికి సాహసంలేదు సరే కదా, కోరికకూడా మీకు లేకపోవడం ఆశ్చర్యం! ఎంత కాలం మీ అమ్మగారి పాదుగులో దూరదామని ఉంది? దూరితేమాత్రం ఏమిటి లాభం?

మనవాళ్లు పూర్వం నాలుగుజాతులు గా భాగించేరు గాని ఇప్పుడంతా ఒకటేజాతి అయిపోయింది; కోమటిజాతి! కోమటిజాతి యెలాగా? మీలాంటి భయస్థులు, అమాయకులు, కొండమేకలు, ఉన్నజాతి కోమటిజాతి కాక మరేమిటి? శూరుడూ, భీరుడూ ఉభయులకూ కోట్లున్నాయి గదూ! అంచేత అందరూ కోమట్లుగా తయారుఅయిపోయినారు, గిరీశంతో సాలతేః రామప్పంతులులాగు! పూర్వపు బ్రాహ్మణుల సత్వగుణమూ లేదు. క్షత్రియుల రజో గుణమూ లేదు; అందరియందూ పూర్ణముగా తమో గుణము వ్యాపించిపోయింది! ఈ దేశంలో మనుష్యులకు గొప్ప కార్యములు చేయడానికి ఉత్సాహమూ లేదు; ఉన్నా శక్తిసామర్థ్యాలు లేవు! ఎలాగో పొట్టగడిస్తే చాలునన్న స్థితిలోనికి వచ్చింది దేశం! అదీ నీచంగా కానీయండి, గొప్పగా కానీయండి, అది లెక్కలేదు! పొట్టగడవడమే ప్రధానం! పొట్టను దాటి మరి లోకంలేదు! కడుపే కైలాసమైపోయింది! పోనీ! అలాగని తృప్తీలేదు! పూర్వపువాళ్లలాగు నిరాడంబర జీవనంలేదు! డాబుకీ, దర్జాకూ, తృష్ణకూ లోటులేదు! కాని చేతకాక యీ పొట్టకూటిమెట్ట వేదాంతము! మరొకటి సాధ్యంకాక యీ కూపస్థ మండూకత్వము! మీ కాళ్లమీద మీరు నిలబడి మీ బ్రతుకు మిమ్మలిని బ్రతుకమంటే మీకు యింత భయమైతే ఎలాగు! బురదగుంటఉంటే మరి పన్నీరుకొలను లెందుకు మీకు? బానిసకూకు ఉంటే చాలును. స్వాతంత్ర్యపు పరమాన్నంవద్దు కదా మీకు? మిమ్మలిని అనవలసిన పనిలేదు, దేశాన్ని అనాలి! అట్టి దానికి ఇట్టిగతి పట్టిందిగదా అని! మనుష్యుల మనస్సుల నిండా మత్సరము, హృదయంనిండా భయము, ఒంటినిండా బద్ధకము, నరాలనిండా అశక్తి, జింహ్వా నిండా అబద్ధం, వాటితో కుళ్లిపోతూవున్నారు! మహాత్ములు దారి అప్పటప్పట చూపినా, అట్లు నడుచుకోడానికీ మనవారికి ఇంకా యోగ్యతపట్ట లేదు! ఎన్నాళ్లు ఇంకా ఈ పాడుపరిస్థితులు ఉంటాయో? ఎన్నాళ్లు ఉండవలసిఉందో? కాలం కర్మం రెండూ కూడితేనేగాని విముక్తిఉండదు! ఏదో పెద్ద కొండవరద వచ్చినట్లు విప్లవము రావాలిగాని మామూలుమాటలచేత యీ స్థితిగతులు సవరణకావు! అది మనతరంలో లేదు! మనకళ్లతో చూడము! ముందెప్పుడు రాబోతుందో మనం చూడగలమేమిటి? ఏదియెట్లైనా మీరు అమ్మపాదుగువదిలి రాలేరు! కానీయండి! ఎన్నాళ్లుపడాలో అన్నాళ్లూ పడతారు! తరువాత దేవుడే ఉన్నాడు! ఇకచాలును, ఆ చెత్త పుస్తకం మూయ్యండి!